www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 17 ఏప్రిల్ 2023
5
చిత్తూరు



'జగనన్న వసతి దీవెన' వాయిదా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా శింగనమల నుంచి ఈనెల 17న సోమవారం జగనన్న వసతి దీవెన 2022 -23 విద్యా సంవత్సరానికి తొలివిడత అర్హత కలిగిన విద్యార్థుల తల్లుల ఖాతాలకు రాష్ట్రవ్యాప్తంగా జమ చేసే కార్యక్రమం వాయిదా వేయడమైనదనిజిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా కలెక్టరేట్ మీటింగు హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం రద్దు చేయడమైనది, వసతి దీవెన నిధుల విడుదల తేదీ గురించి తదుపరి తెలియచేయ గలమని తెలిపారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం..!

సిపిఎం, సిపిఐ 'ప్రచారభేరి'లో సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు పిలుపు

ప్రజాశక్తి- పలమనేరు: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచారభేరి కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని సిల్క్‌ఫారం వద్ద సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో దడాల సుబ్బారావు మాట్లాడుతూ మోడీని గద్దె దించండి.. దేశాన్ని రక్షించండి.. అనే ప్రచార కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం గత 9సంవత్సరాల నుంచి ఒక పథకం ప్రకారం మతవిద్వేషాలు రెచ్చగొట్టడం మన భారత రాజ్యాంగాన్ని లౌకికతత్వాన్ని విధ్వంసం చేయడం, కార్పొరేటర్ల దేశంగా మార్చడం, మోడీ చేస్తున్న దుర్మార్గాలను ప్రశ్నించే వారిని నిర్బంధాలు, కేసులు నమోదు చేయడం నిర్బంధించడం చేస్తున్నారు. దేశ సంపదను ఆదానికి అమ్మేయడం, దేశాన్ని అప్పుల్లో ముంచారు. ధనిక దేశం పేద ప్రజలుగా మార్చారు. కోట్లాదిమంది ప్రజలు పెరుగుతున్న ధరలు భరించలేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళుతున్నారు. మోడీ అనుసరిస్తున్న నియంతత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం ప్రజా పోరాటాలు చేస్తున్న సిపిఐ, సిపిఎం చేసే ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ తిరిగి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి విశేషస్పందన వస్తున్నదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు చిరంజీవమ్మ, ఓబుల్ రాజు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నూరి ఈశ్వర్, సీపీఐ డివిజన్ కార్యదర్శి సుబ్రమణ్యం, సీపీఐ పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా, సిపిఐ పట్టణ కార్యదర్శి మంజునాథ్, ఐద్వా పట్టణ కన్వీనర్ జయంతి, కెవిపిఎస్ నాయకులు పాకాల సుబ్రహ్మణ్యం గుర్రం సుబ్రహ్మణ్యం నాయకులు రాజా,ఆంజి, సంజయ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



పలమనేరులో ప్రచార భేరి కార్యక్రమంలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

నగరి: ఆదానే అంబానీ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామంటూ ఆదివారం సిపిఐ సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రచార గోడ పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వేలన్, బాషా, రూప్ కుమార్, మురళి, శేఖర్, సిపిఎం పట్టణ కార్యదర్శి పేరుమాళ్, జగదీష్, తంగరాజు, మైలుస్వామి, విజయకుమార్, రాజేంద్ర, మునురాజు పాల్గొన్నారు.

లెనిన్‌నగర్‌లో డంపింగ్ యార్డ్‌ను మార్చాలి..!
సిపిఎం-సిపిఐ ప్రచారభేరి డిమాండ్

చిత్తూరు అర్బన్: సిపిఎం- సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచారభేరి మూడవ రోజు ఆదివారం చిత్తూరు లెనిన్‌నగర్‌లో జరిగింది. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజులు మాట్లాడుతూ మోడీని గద్ద దించండి దేశాన్ని రక్షించండి ప్రచారభేరి కార్యక్రమాన్ని లెనిన్‌నగర్ ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా లెనిన్‌నగర్‌లో ప్రజలు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న డంపింగ్ యార్డు ను మార్చాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం గత 9 సంవత్సరాల నుండి ఒక పథకం ప్రకారం మతవిద్వేషాలు రెచ్చగొట్టడం మన భారత రాజ్యాంగాన్ని లౌకికతత్వాన్ని విధ్వంసం చేయడం, కార్పొరేటర్ల దేశంగా మార్చడం, మోడీ చేస్తున్న దుర్మార్గాలను ప్రశ్నించే వారిని నిర్బంధాలు, కేసులు నమోదు చేయడం నిర్బంధించడం చేస్తున్నారు. దేశసంపదను ఆదానికి అమ్మేయడం, దేశాన్ని అప్పుల్లో ముంచారు. ధనిక దేశం పేద ప్రజలుగా మార్చారు. కోట్లాదిమంది ప్రజలు పెరుగుతున్న ధరలు భరించలేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళుతున్నారు. మోడీ అనుసరిస్తున్న నియంతత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం ప్రజా పోరాటాలు చేస్తున్న సీపీఐ, సిపిఎం చేసే ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇంటింటి తిరిగి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ప్రజల నుండి విశేష స్పందన వస్తున్నది. నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వాటికోసం మీరు చేస్తున్న కార్యక్రమం అభినందనీయమని ప్రజల నుండి స్పందన వచ్చింది. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సురేంద్రన్, చైతన్య, ప్రసాద్, జ్యోతిరావు సిపిఐ నాయకులు గోపీ, చంద్ర, విజయకుమారి, విజయగౌరి, మణి, బాలాజి తదితరులు పాల్గొన్నారు.



లెనిన్ నగర్ డంపింగ్ యార్డ్ మార్పు చేయాలంటూ కోరుతున్న వామపక్ష నేతలు



నగరిలో.. పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

సాంఘిక సంక్షేమశాఖతో

మౌలిక వసతులు- మెరుగైన విద్య

జిల్లా సాంఘిక సంక్షేమాధికారి రాజ్యలక్ష్మి

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సాంఘిక సంక్షేమశాఖ ద్వారా జిల్లాలోని వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెరుగైనవిద్యను అందించడంతో పాటు నాడు - నేడులో ఎంపికైన వసతి గృహాల్లో ఆధునిక మార్పులతో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఉపకార వేతనాలు, జగనన్న వసతి దీవెన అందించడం, ఎస్సీ ఉపప్రణాళిక ద్వారా డప్పు, చర్మకారులకు పెన్షన్ అందించడం, కులాంతర వివాహాలకు ప్రోత్సహం, కమ్యూనిహాల్ నిర్మాణం, జగ్జీవన్ జ్యోతి పథకం 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదార్లకు ఉచిత విద్యుత్, జగన్న విదేశీ విద్య, ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామయోజన వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు సంఘీక సంక్షేమశాఖాధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. సాంఘీక సంక్షేమశాఖ ద్వారా అమలు చేస్తున్న అనేక పథకాలను ప్రజాశక్తి ప్రత్యేక కథనంలో తెలియజేస్తూ......

ప్రజాశక్తి: సాంఘీక సంక్షేమశాఖ వసతి గృహాలెన్ని ఉన్నాయి...?

సాంఘీక సంక్షేమ శాఖాధికారి: సాంఘీక సంక్షేమశాఖ పరిధిలో 26 బాలుర వసతి గృహాల్లో 1,141 మంది, 15 బాలికల వసతి గృహాల్లో 698 మంది బాలికలు వసతి పొందుతున్నారు. అలాగే 16 కళాశాల వసతి గృహాల్లో ఏడు బాలుర వసతి గృహాల్లో 416,9 బాలికల వసతి గృహాల్లో 589మంది బాలికలు మొత్తం 1005మంది వసతి పొందుతున్నారు. 2021-22 విద్యా సంవత్సరంలో సాంఘీక సంక్షేమశాఖ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులు 327 మంది పరీక్షలు రాయగా ఇందులో 324మంది ఉత్తీర్ణలైయ్యారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు 291 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నారు.

ప్రజాశక్తి: వసతిగృహాల్లో నాడు- నేడు పథకం ద్వారా ఆదునీకరణ ఎలా ఉంది...?

సాంఘీక సంక్షేమ శాఖాధికారి: నాడు-నేడు ఫెస్ -2లో జిల్లాలో 12 వసతి గృహాలు ఎంపిక చేయడం జరిగింది. ఇందులో మూడు ఎపిఈడబ్ల్యూఐడిసి, మరో 9 ఎపిఎసి ఎస్ఎస్ఎ వారికి ఆదునీకరణ పనుల కోసం కేటాయించారు. నాడు-నేడు కింద ఎంపిక చేసిన వసతి గృహాల ఆదునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ప్రజాశక్తి : జగన్న విద్యాదీవెన పథకం అర్హుతలు ఏమిటి, ఎంత మంది ప్రయోజనం పొందుతున్నారు..?

సాంఘీక సంక్షేమ శాఖాధికారి: వార్షిక ఆదాయం రూ.2.50లక్షల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి, ఇబిసి, కాపు, మైనారిటీ అలాగే విభిన్న ప్రతిభావంతులైన అర్హత కలిగిన విద్యార్థులకు ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ ఆపై ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం లబ్ధి చేకూరుతోంది. ఈ పథకం కింద 2021-22లో 9,814మంది విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో విద్యాదీవెన రూ.6.07కోట్లు జమ, అలాగే నాలుగో విడత గతేడాది నవంబర్ మాసంలో 10.306 మంది ఎస్‌సి విద్యార్థులకు రూ.5.25కోట్లు 9.141 మంది తల్లుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసింది.

ప్రజాశక్తి : జగనన్న వసతి దీవెన పథకం ద్వారా ఎంత మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారు...?

సాంఘీక సంక్షేమ శాఖాధికారి: జీవో నెంబర్ 115 ప్రకారం వసతి దీవెన పథకం క్రింద 75శాతం హాజరు కలిగిన ఐటిఐ చదువుతున్న విద్యార్థులకు రూ.1000, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ. 1,500, డిగ్రీ ఆపై కోర్సులు చదువుతున్న అర్హత కలిగిన విద్యార్థులకు రూ. 2,000 ప్రభుత్వం అందిస్తోంది. 2021-22 విద్యా సంవత్సరంలో ఈ పథకం కింద 9,289మంది ఎస్సీ విద్యార్థులకు రూ.9.07 కోట్లు 8.345మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో గతేడాది ఏప్రిల్ మాసంలో జమచేశారు.

ప్రజాశక్తి: ఎస్సీ ఉపప్రణాళిక ద్వారా డప్పు, చర్మకారులకు అందిస్తున్న పెన్షన్ వివరాలేమిటి...?

సాంఘీక సంక్షేమ శాఖాధికారి: ఎస్సీ ఉపప్రణాళిక ద్వారా ప్రభుత్వం డప్పు, చర్మకారులకు ప్రభుత్వం పెన్షన్ అందిస్తోంది. డప్పు కళాకారులకు రూ.3వేలు, చర్మకారులకు నెలకు రూ.2,750ఇస్తోంది. ఈ పథకం కింద మార్చి 2023 నాటికి 5,725 మంది డప్పు కళాకారులను నెలకు వెయ్యి చొప్పున రూ. 171.75 లక్షలు అలాగే 765 మంది చర్మకారులకు రూ.21.04 లక్షలు పెన్షన్ మంజూరు చేయడం జరిగింది. అలాగే డప్పు కళాకారులకు రెండు జతల యూనిఫాం, గజ్జలు డప్పు పరికరాలు 2019 -20లో పంపిణీ చేశాం.

ప్రజాశక్తి: కులాంతర వివాహం ప్రోత్సహం అర్హతలు ఏమిటి ఎలా పొందాలి..?

సాంఘీక సంక్షేమ శాఖాధికారి: కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు ప్రభుత్వం ప్రోత్సహం అందిస్తోంది. ఒక్కో జంటకు రూ.2.50లక్షలు మంజూరు చేస్తోంది. మొదట రూ.1.50,000లు అందిస్తారు. మిగిలిన లక్ష మూడు సంవత్సరాల తరువాత వడ్డీతో సహా వారి ఖాతాల్లో జమ చేస్తారు. ఈ ఏడాది ఏప్రిల్ నుండీ కులాంత వివాహ ప్రోత్సహం కోసం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలనే ఆదేశాలున్నాయి. వైఎస్ఆర్ కళ్యాణమస్తు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,20,000 కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు అందిస్తోంది. కులాంతర వివాహం చేసుకున్న దంపతుల్లో అమ్మాయి ఎస్సీ అయి ఉండాలనే నిబంధన ఉంది.

ప్రజాశక్తి: జగ్జీవన్ జ్యోతి ఎస్సీలకు ఉచిత విద్యుత్ ఎంత మంది ప్రయోజనం పొందుతున్నారు..?

సాంఘీక సంక్షేమ శాఖాధికారి: జీవో ఎంఎస్ నెంబర్ 91 ప్రకారం జూన్ 2019 నుంచి జగ్జీవన్‌జ్యోతి పథకం అమల్లో ఉంది. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే ఎస్సీ కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ పొందవచ్చు. విద్యుత్ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తోంది. 2021-22లో రూ.4.88 కోట్లు 77.550మంది ఎస్సీ వినియోగదార్ల కోసం ఖర్చు చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంకు ఇప్పటి వరకు రూ.26.07 కోట్లు నిధులు ఈ పథకం కోసం విడుదల చేయగా రూ. 26.07 కోట్లను, 52,301 మంది ఎస్సీలు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదార్లకు ఖర్చు చేయడం జరిగింది.

ప్రజాశక్తి: జగన్నన విదేశీ విద్యాదీవెన పొందాలంటే అర్హత ఏమిటి...?

సాంఘీక సంక్షేమ శాఖాధికారి: జీవో నెంబర్ 39 ప్రకారం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం అమలు చేస్తోంది. తాజా జీవో ప్రకారం టాప్ 200 విశ్వవిద్యాలయాలలో మాత్రమే ప్రవేశం పొందే అర్హత ఆర్థిక సాయం పొందవచ్చు. ఈ పథకం కింద విదేశాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, పిహెచ్‌డి, ఎంబిబిఎస్ కోర్సులు చేయవచ్చు. కుటుంబ వార్షిక ఆదాయం 8లక్షల లోపు ఉండాలి. ఈపథకం కింద జిల్లాలో ఒక్కవిద్యార్థి ఎంపికైయ్యారు.

ప్రజాశక్తి : ఏపి స్టడీ సర్కిల్ కోచింగ్ ఎలా ఉంది..?

సాంఘీక సంక్షేమ శాఖాధికారి: ఎస్సీ, ఎస్టీ అలాగే నిరుద్యోగ అభ్యర్థులకు బ్యాంకింగ్ పిఒఎస్, గ్రూపు -1 కోచింగ్ ఏపి స్టడీ సర్కిల్ ఉచితం రెసిడెన్సియల్ శిక్షణ ఇవ్వడానికి ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించి ప్రతిభావంతులైన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంపిక చేయడం జరుగుతోంది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లాకు చెందిన ఒక విద్యార్థిని ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు 2022 ద్వారా ఏపి స్టడీ సర్కిల్ విశాఖపట్నం నందు సివిల్ కోచింగ్‌కు ఎంపికయ్యారు.

ప్రజాశక్తి: ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామయోజన అంటే ఏమిటి?


సాంఘీక సంక్షేమ శాఖాధికారి: ఐదు వందల మంది జనాభా 50 శాతం ఎస్సీ జనాభా కలిగిన గ్రామాలను ప్రధన మంత్రి ఆదర్శ గామయోజన పథకం ద్వారా మౌలికవసతుల కోసం ఎంపిక చేయడం జరుగుతుంది. జిల్లాలో 46 గ్రామాలను ఈ పథకం కింద ఎంపిక చేయడం జరిగింది. ప్రస్తుతం 22 గ్రామాల్లో ఈ పథకం క్రింద డిఎంయుడి పథకం కింద కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం కోసం సాంఘీక సంక్షేమశాఖ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపడం జరిగింది.

నేడు నగరపాలక కార్యాలయంలో 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం (17.04.2023) ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరుకావాలని తెలిపారు. అన్ని వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3నుంచి 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్‌సెంటర్ నెంబర్ 08572-232745, వాట్సప్ నంబర్ 98499 07885 ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

ఆలయ భూమిని కాజేస్తున్నారు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తమ ముత్తాతలు ఆలయం కోసం కొంత భూమిని కేటాయించి వారసులు ఆ భూమి ద్వారా వచ్చే ఆదాయం నుంచి ఆలయ నిర్వహణ కోసం ఖర్చు చేయాలని పట్టాభూమిని ఇచ్చారని అయితే కొందరు ఉద్దేశ్యపూర్వకంగా ఆ భూమిని కాజేయానలి చూస్తున్నారంటూ పాకాల మండలం ఉప్పరపల్లి హరిజనవాడకు చెందిన రుద్రకోట మీడియాను ఆశ్రయించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రుద్రకోట మాట్లాడుతూ సర్వే నెంబర్ 224లో ఆరు సెంట్లు, రెండవ సర్వే నెంబర్‌లో మూడు సెంట్లు లక్ష్మయ్య ఆలయం కోసం ఇచ్చిన్నట్లు తెలిపారు. తాతల కాలం నుంచి ఆలయ నిర్వహణ కోసం ఉన్న భూమిని స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి రాజకీయనేతల అండతో తహశీల్దార్, పోలీసులు సాయంతో తమపై దౌర్జన్యం చేస్తున్నట్లు తెలిపారు. తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కోరారు. తమ న్యాయం చేయాలని కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రుద్రకోటి

చౌక దుకాణాల్లో

బినామీలదే హవా...

- తనిఖీలు చేయని రెవెన్యూ పౌరసరఫరాల అధికారులు
- గాడి తప్పిన రేషన్ వ్యవస్థ

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: వారు ఆడిందే ఆట... పాడిందే పాట...! రేషన్ బినామీల రాజ్యం అక్కడ ఇక్కడా అనేది కాదు. అన్నిచోట్ల బినామీ రేషన్ డీలర్ల హవా కొనసాగుతోంది. అధికారులతో పాటు అధికారపార్టీ నేతలను ప్రసన్నం చేసుకుని తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. పేదలకు అందాల్సిన రేషన్ సరుకులను నల్లబజారుకు తరలిస్తున్నారు. పైగా ఒక్కొక్కరు రెండు, మూడు షాపులు నిర్వహిస్తూ పెద్ద ఎత్తున సరుకులను రవాణా చేస్తున్నారు. రేషన్ దుకాణాల్లో 40శాతం మంది బినామీలతోనే నడుస్తుండటం గమనార్హం.

పేరు ఒకరిది .. నిర్వహణ మరొకరిది..

రేషన్ షాపు ఎవరి పేరిట ఉందో వారే నిర్వహించాలి. కానీ జిల్లాల్లో నిబంధనలకు విరుద్ధంగా చౌకదుకాణాల్లో బినామీలు పాగా వేశారు. పేదలకు నిత్యావసర సరుకులు ప్రకమంగా సరఫరా చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎన్ని సంస్క రణలు తెస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారి పోతుంది. దుకాణం ఎవరి పేరున ఉందో.. ప్రస్తుతం ఎవరు నిర్వహిస్తున్నాడో తెలియని పరిస్థితి నెలకొంది. ఎంతో కాలంగా చౌక దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై ఆరోపణల నేపథ్యంలో కొందరిని, స్థానిక రాజకీయాల నేపథ్యంలో మరికొందరిని తప్పించారు. అధికార పార్టీనేతల ఒత్తిడి తట్టుకోలేక ఇంకొందరు డీలర్లు చౌక దుకాణాల నిర్వహణకు దూరమయ్యారు. కొందరు మాత్రం తమ పేరునే కొత్త వ్యక్తులు దుకాణాలు నిర్వహించేందుకు సమ్మతించడంతో పౌరసరఫరాల వ్యవస్థ జిల్లాలో అస్తవ్యస్తంగా మారింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2,889 రేషన్ దుకాణాల ద్వారా 11,55,525 మంది తెల్లకార్డు దారులకు సుమారు 400 ఎండియూ ఆపరేటర్ల ద్వారా సరుకులు సరఫరా అవుతు న్నాయి. వాహనాల ద్వారా సరుకులు పంపిణీ జరుగుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే ప్రస్తుతం రేషన్ దుకాణాలు నిర్వహిస్తున్న వారిలో 30 నుంచి 50శాతం వరకు బినామీలే. గతంలో డీలర్లుగా పనిచేస్తున్న వారి పేరునే కొనసాగిస్తూ నిర్వహణ మాత్రం కొత్తవారు చేస్తున్నారు. సంబంధించి డీడీలు తీయాలన్నా నిర్వహణకకు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవడం పనుల్లో బినామీల హవా కొనసాగుతోందన్నది బహిరంగ రహస్యం.



అధికారపార్టీ వారే డీలర్లు...

ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీకి చెందిన ద్వితీయ, తతీయ శ్రేణీ నాయకులే డీలర్‌గా అవతారం ఎత్తడం జిల్లాలో పరిపాటిగా మారింది. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉండటంతో జిల్లాల్లో చాలా చోట్ల వైసీపీకి చెందిన నాయకులే డీలర్లుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో నాయకులు ముందు రేషన్ దుకాణాలపై దష్టిపెట్టి పాగా వేశారు. పాగా వేయడం మొదలు రేషన్ అక్రమాలకు తెరతీశారు. కొందరు కీలరేమిల్లులను కూడా నడుపుతుండటం గమనార్హం. ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటూ రేషన్ అక్రమాలకు పాల్పడుతున్నారు.

అక్రమాలకు బాధ్యులెవరు..!

నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలు జరిగితే బాధ్యులు ఎవరు అనే దానికి స్పష్టత కరువైంది. దుకాణం గతంలో కేటాయించిన వ్యక్తుల పేరుతోనే ఉంటున్నందున తప్పులు గుర్తిస్తే అతని పైనే కేసు నమోదు చేయాలి, కానీ దుకాణం నిర్వహించకుండా వదిలేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేస్తే అధికారులు స్థానికంగా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను గుర్తించిన అధికారులు దుకాణాలు తనిఖీలు చేయడం. మానేశారు. తనిఖీలు చేస్తే 6ఏ కేసులు నమోదు చేసేం ఎదురవుతున్న ఇబ్బందుల నేపథ్యంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో జిల్లాల్లో 8ఏ కేసుల నమోదు సంఖ్య గణనీయంగా తగ్గడానికి కారణంగా చెబుతున్నారు.

అధికారులు కన్నెత్తి చూస్తే ఒట్టు....

రేషన్ దుకాణాలను అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రేషన్ దుకాణాలను రెవెన్యూ అధికారులతో పాటు, ఎన్ఫోరెమెంట్ డీటీలు, ఆర్ఐలకు తనిఖీ చేసే అధికారం ఉంది. గతంలో ఉన్నతాధికారులు సమీక్ష సమావేశాలలో దుకాణాల తనిఖీల గురించి వివరాలు అడిగేవారు. ఇటీవలకాలంలో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడులు సైతం లేకపోవడంతో మండలస్థాయి అధికారులకూ తనిఖీలు గాలికొదిలేశారు. రేషన్ షాపుల పర్యవేక్షణ బాధ్యత ఆహార తనిఖీ అధికారులపై ఉంది. ఫిర్యాదులు అందినప్పుడో సరుకులు దుకాణాలకు సరఫరా లేక ఒత్తిడిలు వచ్చినప్పుడో తనిఖీలు జరగాలి. కానీ ఈతనిఖీలు ఎక్కడా జరగడం లేదు. ఏసమయంలో కూడా అధికారుల తనిఖీల ఊసే ఎత్తడం లేదు. కొందరు దుకాణాల్లో కనీసం నిల్వలను కూడా పరిశీలించడం లేదు. రేషన్ దుకాణాలకు సంబంధించిన దస్త్రాలను తమ కార్యాలయాల్లోనే పరిశీలించినట్లు బియ్యం పక్కదారి పడుతున్నాయని తెలిసినా.. అధికారుల ఆ దిశగా దష్టి సారించకపోవడం గమనార్హం.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీల తనిఖీల జాడేది...

రేషన్ దుకాణాలను నిత్యం తనిఖీలు చేయాల్సిన ఎన్ఫోర్స్మెంట్ డీటీల జాడే కనిపించడం లేదు. జిల్లా పరిధిలో ఉన్న రేషన్ దుకాణాలను తనిఖీలు చేసి, కార్డుదారులకు సకాలంలో సరుకులు అందుతున్నాం.. లేదా? స్టాక్ ఎంత వరకు ఉంది... ఎంత సరుకులు ఇచ్చారు.. వంటి తదితర విషయాలపై సారించాల్సి ఉంది. కానీ, డీటీలు ఆదిశగా పెట్టడం లేదు. నెలనెలా రేషన్‌డీలర్ల అందుతున్న అమ్యామ్యాలకు అలవాటుపడి.. అన్ని సక్రమంగానే ఉన్నట్లు రికార్డుల్లో రాసేస్తున్నారు. కనుసన్నల్లోనే ఎండియూ ఆపరేటర్లు కూడా చేస్తున్నారు. దీంతో డీలర్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల తనిఖీలు చేస్తే డీలర్లు, ఎండియూ ఆపరేటర్లు ఏదైనా పొరపాట చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అధికారుల తనిఖీలు లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా.. సాగుతోంది. పౌరసరఫరాలశాఖ అధికారులు ప్రతిసారి తూతూ మంత్రంగానే రేషన్ దుకాణాలను తనిఖీలు చేస్తున్నారు. డీలర్ల వద్ద ఉన్న రేషన్ నెంబర్లు నమోదు చేసుకొని, పంపిణీ అంతా సవ్యంగా జరుగుతున్నట్టుగా నివేదిక తయారు చేసేదాని వేలిముద్ర తీసుకొని వెళ్ళిపోతున్నారు. అధికారులు పరిశీలనకు వచ్చిన రోజునే ఒక్కో డీలరు తన స్థోమతను బట్టి రూ. 3వేల నుంచి 5 వేల వరకు ముట్టచెబుతున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు జరిగితే డీలరే భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నాచితకా ప్రభుత్వ కార్యక్రమాలు అధికారులు డీలర్లను పురమాయిస్తున్నారు. ఇక సరుకులు వచ్చిపోయేటప్పుడు దారిఖర్చులు, డీజిల్, పని కానిచ్చేస్తున్నారు. ప్రతినెలా వందల టన్నుల బిల్లు డీలర్లే భరిస్తున్నట్లు సమాచారం. ఇన్ని చేస్తున్నప్పటికీ డీలర్ల పై అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మంత్రి అండతోనే దళితులపై దాడి

వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి- పలమనేరు: పుంగనూరులో అంబేద్కర్ జయంతి బ్యానర్ ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించిన దళితునిపై పోలీసులు దాడులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతోనే జరుగుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ముత్తచారిపాళ్యం ఎంబిటి రోడ్డుపైన వ్యవసాయ కార్మిక సంఘం, కులవ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... పుంగనూరులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీలను పోలీసులు తొలగించడం దారుణమని, దళితులపై దాడుల చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుంగనూరులో ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూస్తూ ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు చేయడం సరైన కాదని తెలిపారు. పుంగనూరు ఏమైనా పాకిస్థాన్‌లో లేదని భారతదేశంలోనే వుందని ఇక్కడ ప్రజాస్వామ్యాని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటిని మానుకోకపోతే భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎవరైనా ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వారికి సమయమిచ్చి తొలగించమని చెప్పాలేగాని దౌర్జన్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పోలీసులే భౌతికదాడులు చేయడం సరైనది కాదన్నారు. ఈఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి సంఘటనలపై లౌకికశక్తులు శెట్టి ప్రజాస్వామ్య వాదులందరూ ఐక్యంగా ముక్తకంఠంతో ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్ రాజు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు సురేంద్ర, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, గిరిధర్ గుప్త, కెవిపిఎస్ నాయకులు సుధాకర్ సుబ్రమణ్యం, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక



ప్రజాశక్తి-పలమనేరు: పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు మాజీ మంత్రి అమరనాథ రెడ్డి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. ఆ మేరకు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూతలపట్టు మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఊట్లాల నాగరాజు నాయుడు, వైసీపీ నాయకులు చెంగల్ రాయులు, చిరంజీవి, వెంకట కష్ణయ్య, నారాయణ స్వామి, కళ్యాణ్, విజయకాంత్ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు దొరబాబు చౌదరి, పార్లమెంట్ తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి గంగారపు గోపీ, డిసిసిబి మాజీ ఛైర్మన్ కాంతారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఆనగల్లు మునిరత్నం, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ ఇంద్రసేన నాయుడు, మండలం తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పెద్దపాళ్యం నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈతకల్లు అమ్మకాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి-పాలసముద్రం: మండలంలోని కన్యకాపురం గ్రామంలో ఈత కల్లు అమ్మకాన్ని అరికట్టాలని గ్రామంలోని మహిళలు కోరుతున్నారు. ఆదివారం మండలంలోని కన్యకాపురం సమీపంలో కల్తీ ఈతకల్లు తాగడంతో చాలామంది యువకులు, వద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలిగాపురంలో కల్లు విక్రయించడానికి అనుమతి లేక పోయినా విచ్చలవిడిగా ఈతకొల్లు అమ్మకాలు జరుగుతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈతకల్లు అని చెప్పి అందులో మత్తు మాత్రలు ఎక్కువగా కలిపి ఇవ్వడంతో యువకులు ఆ కల్లు తాగి ఉదయం నుంచి సాయంత్రం వరకు మత్తులో ఏమి చేస్తున్నారో వారికే తెలియట్లేదని స్థానికులు తెలిపారు. కూలీలకు వెళ్లి కష్టపడి సంపాదించిన డబ్బులను కూడా మహిళలకు తెలియకుండా తీసుకెళ్లి ఈ ఈతకల్లును తాగి ఇంట్లో గొడవలు చేస్తున్నారని స్థానిక మహిళలు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత పోలీసులు ఈ ఈతకల్లు విక్రయంపై ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

సాంఘిక దురాచారాల నిర్మూలనకు కృషి



ప్రజాశక్తి-పలమనేరు: కందుకూరి వీరేశలింగం పంతులును ఆదర్శంగా తీసుకొని సాంఘిక దురాచారాల నిర్మూలనకు, మూఢ నమ్మకాలను తొలగించడానికి చదువుకున్నవారంతా కృషి చేయాలని తెలుగు సాహిత్య సాంస్కతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు కోరారు. ఆదివారం స్థానిక కళామందిరంలో కందుకూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసినాథం నాయుడు మాట్లాడుతూ తన రచనలతో సమాజాన్ని జాగతం చేసిన సంఘ సంస్కర్త కందుకూరి అన్నారు. రచనలతో చెప్పడమేకాక తాను స్వయంగా సంఘ సంస్కరణకు పూనుకుని తనను తాను అర్పించుకున్న కార్యదక్షుడు కందుకూరి అన్నారు. దురదష్టవశాత్తు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందిన నేటి కాలంలో అనేక మూఢాచారాలు కొనసాగడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, శివ శంకర్ రెడ్డి, యల్లంపల్లె నరేంద్ర, గిరిధరమూర్తి, సుదర్శనాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి గొడుగుల వితరణ



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: వేపంజేరి గ్రామంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి తిరుపతికి చెందిన వసుంధరదేవి, నాగరాజ శర్మ దంపతులు కలిసి ఆదివారం రూ.25వేలు విలువ చేసే గొడుగులు వితరణ చేశారు. ఈ సందర్భంగా దంపతులు కలిసి రెండు గొడుగులను ఆలయట్రస్టీ కె.ఎస్.శ్రీధర్ కుమారుడు శ్రీ వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఛైర్మన్ కె.ఎస్. వాసు, ఆలయ మేనేజర్ వెంకటేష్ రెడ్డిలకు అందజేశారు. అనంతరం గొడుగులు వితరణ చేసిన దంపతులకు అర్చకులు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి, లక్ష్మీనారాయణస్వామిల దర్శనం చేయించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన దేవరాజులు హరికథ కాలక్షేపం చేయగా, శ్రీవెంకటేశ్వర భక్తి గీతాలు, అన్నమయ్య కీర్తనలను శంకరశర్మ ఆలపించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ మైథిలి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రజాశక్తి-పలమనేరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పలమనేరు టౌన్, కూర్మాయి గ్రామంలో అగ్నిమాపక విన్యాసాలు ప్రదర్శిస్తూ అగ్నిమాపక కరపత్రాలను పంచుతూ ఆదివారం అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు వర్షం కురిసేలా నీటిని వెదజల్లి మంటలను ఆర్పే విన్యాసాలను ప్రదర్శించారు. సిలిండర్ ప్రమాదాలు జరగకుండా మహిళలకు అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ మనోహరన్, సిబ్బంది పాల్గొన్నారు.

రెంటకుంట్లలో 'మా నమ్మకం నువ్వే జగన్'



ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని గంగవరం పంచాయతీ రెంటకుంట్ల గ్రామంలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం సర్పంచ్ చంద్రమ్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జగనన్న చేపట్టిన పథకాలను సర్పంచ్ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పిటిసి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు పాల్గొన్నారు.

మాటపై నిలబడే నాయకుడు సీఎం జగన్: మంత్రి



ప్రజాశక్తి-నగరి: మాటపై నిలబడే నాయకుడు రాష్ట్ర సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మున్సిపల్ పరిధి 8వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి నివాసితులను ఆప్యాయంగా పలకరించారు. వారికి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమాన్ని అంకెలతో సహా వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. నివాసితులు ఆమెను హారతులు పట్టి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో పాలించిన పాలకులకు విరుద్ధంగా తమ నాయకుడు జగన్ మోహన్ రెడ్డి తాను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మొదటి రోజు నుంచే ప్రభుత్వానికి ప్రజలంతా సమానమని, పార్టీ విభేదాలు చూడకుండా అందరికీ న్యాయం చేయాలని చెబుతూ ఆదర్శవంత మైన రాజకీయాలకు తెరతీశారని చెప్పారు. నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. ప్రతి సంక్షేమ పథకం ద్వారా నేరుగా ఆర్థిక లబ్ధిని ప్రజలు పొందేలా జగనన్న చూస్తున్నారన్నారు. ఎవరి బ్యాంకు ఖాతాలకు ఏ సంక్షేమ పథకం కింద ఎంత మొత్తం అందుతున్నదో చెప్పడానికే తాము ఇప్పుడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజల ఉన్నతికి గత తెలుగు దేశం పార్టీ ప్రయత్నించిన దాఖలాలు కూడా లేవన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఒక్కటైనా నెరవేర్చారా అని ప్రజలు గుండెలపై చేయి వేసి ఆలోచించుకుంటే వారికే అర్థమౌతుందన్నారు. టీడీపీలా తాము ప్రజలను ఏమార్చి గద్దెనెక్కి, వారిని అణచివేసే పనులు చేయలేదని ప్రజలు మంచిచేసి వారిని అన్ని విధాలా ఆదుకునేందుకే పాటుపడుతున్నామన్నారు. అందుకే నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌ఛైర్మన్ బాలన్, కౌన్సిలర్ అణ్ణెమ్మ, దయానిధి, నాయకులు యాకోబు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష మెజారిటీ మన లక్ష్యం: ఎమ్మెల్సీ శ్రీకాంత్



ప్రజాశక్తి-గుడిపల్లి: రాబోయే ఎలక్షన్‌లో చంద్రబాబు నాయుడుకి లక్ష మెజారిటీ మన లక్ష్యం అని పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండలంలో తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు పీఎం బాబు నాయుడు ఆధ్వర్యంలో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ తాటాకుల చప్పట్లకు ఎవరూ భయపడద్దని ప్రతి తెలుగుదేశం కార్యకర్తకు తను అండగా ఉంటానని చంద్రబాబుకు మెజారిటీ వచ్చేలా ధ్యేయంగా పనిచేయాలన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అలాంటి మహనీయునికి సైనికుల్లా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల నుంచి భారీగా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఈ నెల 20వ తేదీ చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని, కావున మండలంలో ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం: యమల సుదర్శన్



ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా వారి ఆశయ సాధనకు కృషి చేద్దామని రాష్ట్ర అధ్యక్షులు యమల సుదర్శన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మండల మాల మహానాడు అధ్యక్షులు మంజునాథ్ ఆధ్వర్యంలో పూలమాలవేసి జై భీమ్ నినాదాలు చేశారు. మండలంలోని ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులతో జాతీయ రహదారిపై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఊరేగించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచంలోని అన్ని దేశాల రాజ్యాంగాలను పరిశీలించి భారతదేశానికి దిక్సూచి లాంటి రాజ్యాంగాన్ని రచించారన్నారు. బడుగు, బలహీన వర్గాల వారు భారతదేశంలో అభివద్ధి చెందేందుకు రాజ్యాంగంలో అన్ని హక్కులు కల్పించి, సామాన్య ప్రజలు కూడా రాజకీయ ప్రతినిధులుగా ఎదిగేందుకు అణగారిన వర్గాలకు అంబేద్కర్ ఆదర్శవంతమైనదని ఎంపీపీ రెడ్డప్ప అన్నారు. అంబేద్కర్ భారతదేశంలోని ప్రతి వ్యక్తికి మేలు చేకూరే విధంగా చట్టాలు రూపకల్పన చేశారని ఇప్పుడు అంబేద్కర్ని ఒక వర్గానికే ఆపాదించడం సరికాదని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులకు ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం అన్నారు. రాష్ట్ర ఆర్టిఐ సెల్ అధ్యక్షులు ఆంజప్ప, మాల మహా నాడు జిల్లా ఉపాధ్యక్షులు గూండా మనోహర్, జై భీమ్ యువ జన సంఘం అధ్యక్షులు అమర నారాయణ, తిప్పన్న, రెడ్డప్ప, జయప్ప, అన్నమయ్య జిల్లా చిత్తూరు జిల్లా ప్రజాసంఘాల నాయకులు, మండలంలోని ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఇదేమి ఖర్మ ఈ రాష్ట్రానికి'



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి మాజీ మంత్రి అమరనాథ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మాజీ మంత్రి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, శేషు, అమర, శ్రీనివాస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నగరి: మున్సిపల్ పరిధిలోని నగరిపేట 1వ వార్డులో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నగరి నియో జకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్, టీడీపీ నాయకులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. నగరి పట్టణ అధ్యక్షులు రమేష్ బాబు, బిసి నాయకులు, స్టేట్ మైనారిటీ సెల్ ఖాదర్‌భాయ్, టిఎన్‌టిసి జ్యోతి నాయుడు, గుణశేఖర్ నాయుడు, రొక్కం బాలాజీ, కరగంటపుర అశోక్, పాల్గొన్నారు.



ఉచిత కంటివైద్య శిబిరానికి స్పందన



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మహతి ఫౌండేషన్ సహకారంతో పిఎస్ హాస్పిటల్ కుప్పం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా చికిత్సకు 86 మంది హాజరు కాగా 19 మంది ఉచిత కంటి వైద్య శిబిరంనకు సెలక్షన్ చేసినట్లు మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు తెలియపరిచారు. సెలెక్ట్ అయిన వారిని కుప్పం పిఇ ఎస్ హాస్పిటల్‌లో కంటి ఆపరేషన్లు చేసి పేషెంట్లకు రానుపోను బస్సు సౌకర్యం కల్పించారు. ఆపరేషన్‌కు సెలక్ట్ కాని వారికి తగిన మందులు, మాత్రలు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో మారుతి ఫౌండేషన్ సంస్థ సహాయకులు, పిఇఎస్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం పోరాడుతాం: ఐఎన్‌టియుసి



ప్రజాశక్తి- తిరుపతి సిటి

కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటామని ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు లేబూరి రత్నకుమార్ తెలిపారు. స్థానిక యూత్ హాస్టల్‌లో ఐఎన్‌టియుసి ఉమ్మడి చిత్తూరు జిల్లా (అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల) కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాను మూడు జిల్లాలుగా విభజించారని, వాటికి 2022 డిసెంబరులో కొత్త కమిటీలు వేశామన్నారు. తర్వాత తొలి కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించి, భవిష్యత్ కార్యచరణ చర్చించామని అన్నారు. మూడుజిల్లాలో ఐఎన్‌టియుసిని మరింత బలోపేతం చేసి, ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉన్న 39వేల సభ్యత్వాలను మరింత పెంచుతామని తెలిపారు. కార్మిక సంఘాలన్నీ ఏకం కావాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని కార్పొరేట్ సంస్థలు పాలిస్తున్నాయని విమర్శించారు. పలు సంస్థల్లో కార్మికులను తగ్గించేసి, సంస్థలను కార్పొరేట్‌కు అప్పగిస్తూ కేంద్రం ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం దేశాన్ని అమ్మేస్తోందని, ఎర్రకోట, విమానశ్రయాలు, రైల్వేలను ఇప్పటికే అమ్మేసిందని, తిరుపతి ఎయిర్‌పోర్టును సైతం అమ్మకానికి పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్ర్యం వచ్చిన కొత్తల్లో సైతం ప్రభుత్వాలు కార్మికులకు జీతాలు సక్రమంగా ఇచ్చాయని, ఇప్పుడు ఉన్న పాలకులు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో పాలన సాగిస్తూ, దోచేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి వాటిని అడ్డుకునేందుకు కార్మిక సంఘాలను ఏకమై, విస్తృత పోరాటాలను చేయాలని కోరారు. అందుకు ఐఎన్‌టియుసి కృషి చేస్తుందన్నారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ ప్రసాద్, పవన్, షమీఉల్లా, రాజేస్, మునెయ్య, మురళీ, బోయాషావల్లి, అనుషా పాల్గొన్నారు.

నారా లోకేష్ నశించాలి: జడ్పిటిసి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలుగుదేశం పార్టీ నాయకుడు నారా లోకేష్ నశించాలని జడ్పిటిసి సోమశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నారా లోకేష్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ రాజ్యాధికారంలో దళితులు ఏం పీకింది లేదని మాట్లాడటం ఆయన విజ్ఞతకు నిదర్శనమని, దళిత ఓట్లతో అధికారం చేపట్టి అధికారం కోల్పోయేటప్పటికీ దళితులను విస్మరించి మాట్లాడటం తగదన్నారు. దేశం మొత్తం రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ వేడుకలు జరుపుకుంటున్న దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తెలుగుదేశం పార్టీలో దళితులకు ఉన్న విలువను బహిర్గతం చేయడమేనన్నారు. ఇలాంటివి మానుకోకపోతే దళితులే తగిన గుణపాఠం తెలుపుతారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామచంద్ర రెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష రెడ్డి, సర్పంచులు ధనంజయ, బాలాజీ, భారతి, ఎంపిటిసి ఉషారాణి, దళిత నాయకులు సుబ్రహ్మణ్యం, జగదీష్ జేమ్స్, చంద్రకాంత్, విజయ్, నాగార్జున, వెంకటేష్, సాంబయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావ్ పూలే ఎక్సలెన్స్ అవార్డుకు హరిప్రసాద్ ఎంపిక



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మహాత్మ జ్యోతిరావ్ పూలే 196వ జయంతి ఉత్సవం సందర్భంగా మహాత్మ జ్యోతిరావ్ పూలే ఎక్సలెన్స్ అవార్డ్ 2023 ప్రధానోత్సవ కార్యక్రమం తిరుపతిలోని దుర్గాబాయి దేష్‌ముఖ్ మహిళా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ఠ సేవలు అందించిన 55 మంది ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. మండలంలోని కొత్త ముద్దేపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వడ్ల హరిప్రసాద్‌ను ఎంపిక చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్, తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ అవార్డుకు ఎంపిక కావడం మండలానికి గర్వకారణం అని మండల విద్యాశాఖాధికారి హేమలత తెలిపారు. పలువులు ఉపాధ్యాయులు హరి ప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.

చంద్రగిరి వారపు సంతలో అన్నదానం



ప్రజాశక్తి-చంద్రగిరి: నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరి వారపు సంతలో ఆదివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం సంతకు విచ్చేసే వినియోగదారుల సౌకర్యార్థం ఉచిత భోజన వసతులను కల్పించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని వారసంతల్లో ప్రజలకు ఉచిత భోజన వసతులు కల్పించే ఏర్పాట్లు చేస్తామన్నారు. వారపు సంతలో రైతులు తాము పండించిన కూరగాయలను ఎలాంటి రుసుం చెల్లించకుండా విక్రయించుకునే సౌకర్యాల్ని కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: క్రీడలతో మానసికోల్లాసం, శారీరక ధారుడ్యం ఏర్పడుతుందని శ్రీకాళహస్తి డీఎస్పీ విశ్వనాథ్ అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఇంట్రామిరల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డీఎస్పీ సూచించారు. ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావు, పాఠశాల కమిటీ ఛైర్మన్ అర్కాట్ శంకర్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు రాజేశ్వరి, జూతురు డిజిటల్స్ అధినేత రాదేశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రమేష్ నాయుడుకు మాతృ వియోగం




ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుంద్రం పంచాయతీ ఆరిమాకులపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత రమేష్ నాయుడు మాతమూర్తి రాజమ్మ(80) గత కొంత కాలంగా అనారోగ్యం బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం ఉదయం ఆమె భౌతికకాయానికి పలువురు టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ చిట్టిబాబు నాయుడు, మాజీ తూగుంద్రం పీహెచ్‌సీ కమిటీ ఛైర్మన్ నరసింహులు నాయుడు, నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అశోక్ నాయుడు, పార్లమెంట్ టీఎన్టీయూసీ అధికార ప్రతినిధి జీవరత్నం, మండల క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడు శాంతకుమార్, నరసింహులు నాయుడు, దాసరపల్లి శంకర్, ముత్తు పాల్గొన్నారు.

ద్రావిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌పై కేసు

ప్రజాశక్తి-రామకుప్పం: రామకుప్పం మండల పరిధిలోని పెద్ద తాండ గ్రామపంచాయతీ సర్పంచ్ మోహన్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంబేద్కర్ జయంతి రోజు గిరిజన ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని కుప్పం నియోజకవర్గం, గుడిపల్లి మండలంలోని ద్రావిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వేణుగోపాల్ రెడ్డిని ఫోన్ ద్వారా అడిగినందుకు సర్పంచ్‌పై దుర్భాషలాడిన అభియోగంపై ఎస్ఐ కష్ణయ్య ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

కామదొడ్డి గంగమ్మ సేవలో ఎమ్మెల్యే



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని పెద్ద చల్లారగుంట పంచాయతీ పరిధిలోని కామదొడ్డి గంగమ్మ జాతరను చుట్టుపక్కల గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం పలమనేరు నియోజకవర్గ శాసనసభ్యులు వెంకటే గౌడ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కష్ణమూర్తి, జడ్పిటిసి కేశవులు హాజరుకాగా ఆలయ ఛైర్మన్ స్పందించి ఎమ్మెల్యే, కష్ణమూర్తిలకు కండువా కప్పి స్వాగతం పలికి ప్రత్యేకంగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. స్థానిక సర్పంచ్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి కేశవులు, లక్కనపల్లి సర్పంచ్ కష్ణారెడ్డి, బైరెడ్డిపల్లి సర్పంచ్ వెంకటేష్, బేలుపల్లి సర్పంచ్, మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు మండల పరిధిలోని గ్రామాల ప్రజలు పాల్గొని మొక్కులు తీర్చుకుని అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

తెలుగు యువతకు అభినందనలు



ప్రజాశక్తి-రామకుప్పం: మండలం తెలుగు యువత అధ్యక్ష, కార్యదర్శులకు నియోజకవర్గ టిడిపి నేతలు అభినందనలు తెలియజేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలంకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ యువత తెలుగుదేశం పార్టీకి అత్యున్నత స్థానం కల్పించి రాష్ట్ర భవితకు చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాక్షస పాలన, అభివద్ధి కుంటపడిందని, యువత సమిష్టి కషితో జరుగుతున్న పాలనపై ప్రజలకు వివరించాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుని లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలన్నారు. గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చురుగ్గా నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, కార్యదర్శి నరసింహులు, కష్ణా నాయక్, గంట్లప్ప గౌడు, చంద్రశేఖర్, వెంకటరమణ, మురళి, రఘు, వెంకటరమణ, గిరి, సుబ్రి, సతీష్, అవినాష్, అమర్, ఆదిల్ తదితరులు ఉన్నారు.

స్వయంబీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి-సోమల: స్థానికంగా వెలిసిన శ్రీ స్వయంబీస్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం కుంభాభిషేకంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం కలశ స్థాపన అనంతరం ధ్వజారోహణం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలను ఆలయ అర్చకులు వేదమంత్రాల సాక్షిగా ప్రారంభించారు. గ్రామంలోని యువకులు, మహిళలు 101 బిందెల నీళ్లతో ఆలయ గోపురం పరిసరాలను, స్వామివారి మూల విగ్రహానికి కుంబాభిషేకం చేశారు. 16 నుంచి 24వ తేదీ వరకు రోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్ర వేళల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలను పుష్ప పల్లకిల్లో ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 20వ తేదీ స్వామివారి కల్యాణోత్సవం, 22వ తేదీ రథోత్సవం, 24వ తేదీ వసంతోత్సవం, ధ్వజావరోహణం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి కపకు పాత్రులు కావాలని నిర్వాహకులు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-కోట: పట్టణంలోని శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ షిరిడి సాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో నెల్లూరు రెడ్ క్రాస్ సౌజన్యంతో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కోట మండలంలోని పలు గ్రామాల నుండి యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. సుమారు 111 మంది రక్తదానం చేశారు. శిబిరంలో మొత్తం 333 యూనిట్ల రక్తాన్ని రెడ్ క్రాస్ సంస్థ సేకరించారు. రక్తదానం చేసిన రక్త దాతలను జగన్మోహన్ రెడ్డి, అల్లం రమణయ్యలు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.